


సిద్దిపేట అర్బన్ : మిట్టపల్లి రైతువేదికలో కరెంట్ లేకపోవడంతో ఆగిన ఫ్యాన్లు

- రైతులకు సమాచారం ఇవ్వకుండానే సదస్సులు
- పరిచయం ఉన్న దగ్గరి వారిని పిలిపించుకున్న అధికారులు
- దుబ్బాక సదస్సులో పదిమంది కూడా పాల్గొనని రైతులు
- వీడియో కాన్ఫరెన్స్‌లో చాలామంది కనిపించేలా రైతులతో కలిసి కూర్చున్న ఏఈవోలు


నమస్తే తెలంగాణ

మెదక్

I హైదరాబాద్, బుధవారం 26 జూన్ 2024 MEDAK


## రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



హుగ్గెల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు


కోహీర్, జూన్ 25: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డివిజన్ వ్యవసాయాధికారి భిక్షపతి, జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల వ్యవసాయాధికారులు ప్రవీణ, లావణ్య, వినోద్‌కుమార్, నవీన్‌కుమార్, ఏఈవోలు ప్రదీప్‌కుమార్, వీరేందర్, శ్రీనివాస్, సంధ్య, రేణుక, వేదవతి, మౌనిక వర్మ, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతు భరోసాపై అభిప్రాయాలు సేకరించారు.

# నామమాత్రంగా రైతు సదస్సులు

దుబ్బాక, జూన్ 25: రైతు భరోసా విధానాలు, నూతన నిబంధనలపై రైతుల అభిప్రాయాలను సేకరించేందుకు మంగళవారం దుబ్బాక రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు తూతూమంత్రంగా మమా అనిపించారు. రైతులకు సమాచారం ఇవ్వకుండానే రైతు వేదికలో రైతు సదస్సు నిర్వహించడంపై పలువురు రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. దుబ్బాకలో రైతువేదికలో నిర్వహించిన అభిప్రాయాల సేకరణ కార్యక్రమానికి రైతులు లేకుండాపోయారు. తమకు పరిచయం ఉన్న పదిమంది రైతులను బలవంతంగా పిలిపించుకుని రైతు అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ముగించి అధికారులు చేతులు దులుపుకున్నారు. రైతు అభిప్రాయ సేకరణ కార్యక్రమంపై రైతులకు సమాచారం ఇవ్వలేదు. దీంతో అధికారుల తీరుపై రైతులు మండిపడుతున్నారు.

### పదిమందిలోపే రైతులు

దుబ్బాక రైతువేదికలో నిర్వహించిన సదస్సులో కేవలం పదిమంది లోపే రైతులు పాల్గొనటం గమనార్హం. డివిజన్ పరిధిలోని వేలమంది రైతులున్నప్పటికీ పట్టుమని పదిమంది రైతులు కూడా సదస్సులో పాల్గొనకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. వచ్చిన రైతులను వ్యవసాయాధికారులు తమ వెంట తీసుకొచ్చినవారే కావడం విశేషం. వీడియో కాన్ఫరెన్స్‌లో రైతు లు చాలా మంది ఉన్నట్లు కనిపించేందుకు ఏఈవోలు వారితో కూర్చోవాల్సిన దుస్థితి నెలకొంది. దుబ్బాక ఏడీ పరిధిలోని ఏఈవోల కంటే రైతులు తక్కువగా హాజరయ్యారు. వచ్చిన రైతుల నుంచి రైతు భరోసా, తదితర వాటిపై నామమాత్రంగా కాగితాలపై వారి అభిప్రాయాలను సేకరించారు. 5 ఎకరాల లోపున్న రైతులకే రైతు బంధు ఇవ్వాలని వచ్చిన రైతుల తరుపున అభిప్రాయాలను తీసుకున్నారు.



దుబ్బాక రైతు వేదికలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో రైతులతో కూర్చున్న ఏఈవోలు

## కష్టపడే వారికి రైతుభరోసా ఇవ్వాలి



కోహీర్, జూన్ 25: పంటలు పండించే రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి. రైతుల వద్ద కార్లు ఉన్నాయా.? వాళ్లు ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా.? అని చూడకూడదు. పొలాల్లో కష్టపడి పనిచేసే రైతులందరికీ రైతు భరోసా వర్తింపజేయాలి. పెద్ద పెద్ద వెంచర్లు ఉన్న యజమానులు, స్విమ్మింగ్ పూల్స్ ఉండే వారికి అవసరం లేదు. నిజమైన రైతులకు మాత్రమే రైతు భరోసా అందజేయాలి.

- మోహన్, రైతు, రంజోల్, జహీరాబాద్ మండలం

## 15 ఎకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలి



సిర్గాపూర్, జూన్ 25: ప్రభుత్వం 15 ఎకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలి. నారాయణఖేడ్ ప్రాం తంలో పెద్ద ప్రాజెక్టులు, పంట కాల్వలు పెద్దగా లేవు. కేవలం ఇక్కడి రైతులు వర్షాధారిత పంటలపైనే ఆధారపడి ఉన్నారు. గతంలో మాదిరిగా గట్లు, చెట్లు, సాగు లేని భూములకు రైతు భరోసా ఇవ్వకుండా త్వరగా పంట పెట్టుబడి సాయం అందించాలి. రైతులకు ఏకకాలంలోనే రుణమాఫీ చేయాలి. రైతు బీమా కోసం వయస్సు పరిమితిని తొలిగించాలి. పంటల సర్వే ప్రక్రియలో ఏఈవోతోపాటు గ్రామ ఆదర్శ రైతులు పాల్గొనాలి. ఎరువులు, సబ్సిడీ, రాయితీ వ్యవసాయ పరికరాలు సకాలంలో అందించాలి. ఇక్కడి ప్రాంతంలో అధికంగా పండిం చే దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం పునరుద్ధరించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలి.

- హన్మంత్‌రెడ్డి, రైతు, కడ్పల్ గ్రామం, సిర్గాపూర్ మండలం

## సమయానికి రైతుభరోసా ఇస్తే ఉపయోగం..



బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన విధంగా రైతుభరోసా ఇవ్వాలి. ఆలస్యం చేయకుండా సమయానికి రైతులకు పెట్టుబడి సాయం అందిస్తే ఎంతో లాభం ఉంటుంది. ఎంత భూమి ఉన్నా, పది ఎకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలి. పంట సాగుకు ముందే ఇస్తే రైతులకు కొంత ఊరటగా ఉంటుంది. విత్తనాలు, ఎరువులు ముందే తెచ్చుకునేందుకు వీలుగా పెట్టుబడి పైసలు వేస్తే బాగుంటుంది.

- రాంరెడ్డి, రైతు, మందపల్లి గ్రామం

## పది ఎకరాల వరకు ఇవ్వాలి..



నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఎంత భూమి ఉన్నా పది ఎకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలి. అధికారులకు కూడా మేము ఇదే విషయాన్ని చెప్పాం. కుద్దుగా సాగు చేసే భూమికి పెట్టుబడి ఇస్తే బాగుంటుంది. అది కూడా పంట సాగు చేసే ముందే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

- జక్కు ఐలయ్య, రైతు, మిట్టపల్లి గ్రామం

## రైతులందరికీ రైతు భరోసా అందించాలి



రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ ప్రభుత్వం ఆర్థిక భరోసా అందించాలి. రైతు లు ఇప్పటికే పొలాల్లో పం టలు వేసుకునేటోళ్లు. వర్షా లు కురవకపోవడంతోనే పంటలు వేసుకోలేదు. అంతేకాకుండా ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవడంతో కొంతమంది రైతులు చేతుల్లో డబ్బులేక పంటలు వేయలేకపోయారు.

-రాగి అశోక్, రైతు, సుతారిపల్లి

## పండించిన పంటకు బోనస్ ఇవ్వాలి



రైతులు పండించిన ప్రతి పంటకూ బోనస్ ఇస్తే రైతు భరోసా లేకున్నా ఏం లేదు. ఎందుకంటే రైతు భరోసా పేరుతో సాగు కానీ భూములకు కూడా ప్రభుత్వం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. దీని వల్ల కౌలు రైతులకు గానీ, సాధారణ రైతులకు గానీ మేలు జరగడం లేదు. ఎకర భూమిలో 25క్వింటాళ్ల వడ్లు పండుతయ్. ఒక్కో క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తే ఆ రైతుకు పంటకు రూ.12,500 అదనంగా లాభం చేకూరుతుంది. రెండు పంటల కింద ఏడాదికి రూ.25వేలు వస్తాయి. రైతు భరోసా కింద ఎకరానికి కేవలం రూ.7,500 మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి. కౌలు రైతులకు కూడా లాభం అవుతుంది. కష్టపడి పంటలు పండించే రైతుకు మాత్రమే లాభం చేకూర్చి ఇంకా ఉత్సాహంతో అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించాలంటే ప్రతి పంటకూ బోనస్ ఇవ్వాలి.

-వేల్పుల నాగార్జున, రైతు, ఆరెపల్లి, హుస్నాబాద్

## సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందజేయాలి



రైతులకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందజేయాలి. పది ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు రైతు భరోసా రూ.15వేలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం ప్రకటించినట్లుగా బోనస్ ఇస్తూ సబ్సిడీ పనిముట్లు ఇచ్చినట్లయితే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. పంటల బీమా పక్కాగా అమలు చేయాలి. వ్యవసాయానికి పనికిరాని భూములకు కూడా రైతు భరోసా ఇస్తే డబ్బులు వృథాకావడంతోపాటు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు ఇచ్చే అవకాశం ఉండదు. సాగునీటి ఎద్దడి కారణంగా ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం ఇప్పటివరకు పరిహారం ఇవ్వ లేదు. ఇప్పటికైనా పరిహారం నిధులు మంజూరు చేయాలి. కౌలు రైతులను గుర్తించి వారికి కూడా రైతుభరోసా అందేలా చర్యలు తీసుకోవాలి. పంటల సాగులో మెళకువలు వివరించేలా సదస్సులు ఏర్పాటు చేయాలి. విత్తనాల ఎంపిక తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తే బాగుంటుంది.

-ఎలకంటి మహేందర్‌రెడ్డి, రైతు, హుస్నాబాద్

## షరతులు లేకుండా రైతుభరోసా ఇవ్వాలి



గుమ్మడిదల, జూన్ 25: వానకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులవుతున్నా పెట్టుబడి సాయం జాడలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ సర్కారు సీజన్ ప్రారంభంకాగానే రైతుబంధు సాయం ఇచ్చేది. ఇప్పుడు రైతుభరోసా అని కాంగ్రెస్ సర్కారు ఎకరాకు రూ.15 వేలు సాయం అందిస్తామని చెప్పి కొర్రీలు పెడుతుంది. దీనికి రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నారు. నియోజకవర్గంలో ఒక రైతువేదికలో రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయడం సరికాదు. ప్రతి మండలంలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. కానీ ఏదిలేకుండా వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయడం రైతులను అవమానపర్చడమే. ప్రభుత్వం ఇస్తానన్న రైతుభరోసా షరతులు లేకుండా అర్హులైన రైతులకు ఇవ్వాలి. కౌలు రైతులకు కూడా ఇస్తామని ఎన్నికల్లో చెప్పినప్పటికీ ఇప్పటికీ ఒక కౌలు రైతుకు కూడా ఇవ్వలేదు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం నిలబడదని గుర్తుంచుకోవాలి. రైతు భరోసా త్వరగా ఇవ్వాలి. లేదంటే సర్కారు రైతుల ఆగ్రహం చవి చూడాల్సి వస్తది.

- సుధాకర్‌రెడ్డి, రైతు, గుమ్మడిదల మండలం

# సమయానికి రైతు భరోసా ఇవ్వాలి

- సిద్దిపేట మండలం మిట్టపల్లిలో రైతుల అభిప్రాయ సేకరణ
- సమావేశ సమయంలో కరెంట్ లేక ఇబ్బందిపడిన అధికారులు, రైతులు
- ఇన్వర్టర్ సాయంతో సమావేశం కొనసాగింపు
- బీఆర్ఎస్ తరహాలో ఇవ్వాలన్న రైతులు



మిట్టపల్లిలో హాజరైన రైతులు, వ్యవసాయశాఖ అధికారులు

సిద్దిపేట అర్బన్, జూన్ 25: రైతుభరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ కోసం అధికారులు మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సిద్దిపేట మండల పరిధిలోని మిట్టపల్లి రైతువేదికలో జరిగిన సమావేశంలో రైతులు అధికారులకు అభిప్రాయాన్ని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఎకరానికి రూ.7500, కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన నేపథ్యంలో రైతు భరోసా ఎవరికి ఇవ్వాలి.. ఎన్ని ఎకరాల వరకు ఇవ్వాలి.. ఎవరికి ఇవ్వద్దు.. ప్రభు త్వ ఉద్యోగులకు ఇవ్వాలా.. వద్దా.. వంటి అభిప్రాయాలను రైతుల నుంచి సేకరించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన విధంగా సమయానికి రైతుభరోసా ఇవ్వాలని ముక్త కంఠంతో తెలిపారు. ఎన్ని ఎకరాలు రైతుకు ఉన్నా పది ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని మెజారిటీ రైతులు తమ అభిప్రాయాలు తెలిపారు. అదే విధంగా రైతుభరోసాపై కాలయాపన చేయకుండా వానకాలం, యాసంగి సీజన్ల ప్రారంభంలోనే పెట్టుబడి నిధులు వేస్తే రైతులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్‌ప్రభుత్వం సరిగ్గా పంటలు సాగు చేసే సమయంలోనే రైతుబంధు వేసిందని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని పలువురు అసహనం వ్యక్తం చేశారు.

### ఇన్వర్టర్ సాయంతో సమావేశం

రైతుభరోసాపై అభిప్రాయ సేకరణలో భాగంగా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి రైతువేదికలో అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశానికి కరెంట్ లేకపోవడంతో ఇన్వర్టర్ సాయంతో వీడియో కాన్ఫరెన్స్‌ను నడిపించారు. కరెంట్ లేకపోవడంతో ఫ్యాన్లు, కూలర్లు నడవకపోవడంతో రైతులు, అధికారులు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. దీంతో కొందరు వ్యవసాయ అధికారులు, రైతులు కర్చీఫ్, పుస్తకాలు, పేపర్ల సాయంతో గాలి ఊపుకుంటూ కనిపించారు.

# రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తాం



రామాయంపేటలో వీడియో కాన్ఫరెన్స్ తిలకిస్తున్న రైతులు, వ్యవసాయ శాఖ డివిజన్ ఏవోలు

- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- వీడియో కాన్ఫరెన్స్‌లో రైతుల అభిప్రాయాలు తెలుసుకున్న మంత్రి
- వానకాలం పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలి
- మెదక్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు వసంత సుగుణ

రామాయంపేట, జూన్ 25: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుందని వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతులతో అన్నారు. మంగళవారం రామాయంపేట పట్టణంలోని రైతువేదికలో నిర్వహించిన రైతుకు ఆర్థిక భరోసాపై రైతులకు మంత్రి పలు సూచనలు సలహాలిచ్చారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిరైతుకూ ప్రభుత్వ సాయం అందాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రి రైతులతో మాట్లాడి అర్హులైన వ్యవసాయ చేసే రైతులకే రైతు భరోసా అందేవిధంగా ప్రభుత్వం విధివిధానాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న భరోసాను రైతుకందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతులకు ప్రభుత్వం ద్వారా చేయూతనందిస్తే ఎక్కువమంది రైతులు లబ్ధి పొందుతారని తెలిపారు. గుట్టలు, రోడ్లు వ్యవసాయానికి పనికిరాకుండా ఉన్న భూములపై రైతు భరోసా వర్తించదన్నారు. అలాంటి రైతులకు రైతు భరోసా రాదని మంత్రి తెలిపారు.

### రైతులు అధికారుల సూచనలు పాటించాలి




అధికారుల సూచన మేరకు రైతులు పొలాల్లో వానకాలం పంటలు వేసుకోవాలని రామాయంపేట డివిజన్ సహాయ సంచాలకురాలు వసంత సుగుణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్సుకు హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతు వ్యవసాయ శాఖ సలహా మేరకు పంటలను విత్తుకోవాలన్నారు. భూమిలో ఎలాంటి పంట పండుతుంది అనే విషయాన్ని భూపరీక్షలు నిర్వహించుకుని దానికనుగుణంగా పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయన్నారు. వీడియో కాన్ఫరెన్సులో డివిజన్ వ్యవసాయ శాఖ అధికారులు రాజ్‌నారాయణ, సతీశ్, హరిప్రసాద్ ఉన్నారు.

-వసంత సుగుణ, ఏడీఏ, రామాయంపేట

# ప్రభుత్వానికి రైతు సమస్యలు పట్టవా..?

### దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



రాయపోల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, జూన్ 25 : రైతు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయపోల్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఆగ్రోస్ కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అటు వర్షాలు, ఇటు ఎరువులు లేక రైతులు పడరానిపాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ అమలు చేసినట్లు రైతుబంధును ఇప్పటివరకు రైతులకు అందించకపోవడంతో వారు పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులకు మరింత భారంగా మారిందన్నారు. ప్రస్తుతం వర్షాలు లేక కాల్వల ద్వారా నీరు వస్తే రైతులు పంటలను కాపాడుకునే అవకాశం ఉందన్నారు. రైతులు సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ సర్కార్ పార్టీ ఫిరాయింపులకు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఇప్పటికైనా రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో రైతుల తరపున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం రేణుకాఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ గౌడ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# పది ఎకరాల్లోపు రైతులందరికీ ఇవ్వాలి



కొల్చారం రైతు వేదికలో రైతునేస్తంలో పాల్గొన్న రైతులు, అధికారులు

కొల్చారం, జూన్ 25: కొల్చారం రైతువేదికలో రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతునేస్తంలో భాగంగా మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వానకాలంలో వివిధ పంటల సాగు విధానం, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపై రైతులకు అవగాహన నిర్వహించారు. అనంతరం రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ రైతుల నుంచి రాతపూర్వక అభిప్రాయాలు సేకరించాలని అధికారులకు సూచించారు. పలువురు రైతులు మాట్లాడుతూ భూపరిమితి పది ఎకరాలకు కుదించాలన్నారు. ఈ రోజుల్లో సొంత వాహనాలు సర్వ సాధారనమని, వివిధ రకాల లోన్లు తీసుకునే రైతులు ఇన్‌కం టాక్స్ కడుతున్నారన్నారు. ఉద్యోగం ఆంక్ష పెడితే చిరు ఉద్యోగులు ఎక్కువగా నష్టపోతారన్నారు. రైతుబీమా వయోపరిమితి తొలిగించాలని కోరారు. కార్యక్రమంలో మదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, సహాయ వ్యవసాయ సంచాలకురాలు పుణ్యవతి, మెదక్ వ్యవసాయ సంచాలకులు విజయ నిర్మల, కౌడిపల్లి డివిజన్, మెదక్ డివిజన్ వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# రైతు భరోసాతోపాటు బోనస్ ఇవ్వాలి

### హుస్నాబాద్‌లో రాతపూర్వకంగా అభిప్రాయాల సేకరణ

హుస్నాబాద్, జూన్ 25 : హుస్నాబాద్‌లోని రైతు వేదికలో మంగళవారం జరిగిన సమావేశంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతుల అభిప్రాయాలు సేకరించారు. రైతు భరోసా ఎలా ఉంటే బాగుంటుందో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో హుస్నాబాద్‌కు చెందిన పలువురు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతు భరోసా రూ.15వేలు ఇవ్వడంతో పాటు ప్రతి పంటకూ రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. కొందరు రైతులతో అధికారులు రాతపూర్వకంగా అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ మహేశ్, ఏవో నాగరాజురెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఏఈవోలు, హుస్నాబాద్ పట్టణానికి చెందిన రైతులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ రైతు వేదికలో వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, అధికారులు

# రైతు భరోసాకు ఆంక్షలు వద్దు

- ఐదు ఎకరాల్లోపు అయితే ఇబ్బందులు..
- పది ఎకరాల్లోపు రైతులందరికీ ఇవ్వాలి
- కొండాపూర్ రైతుసదస్సులో రైతుల వేడుకోలు
- హాజరైన కలెక్టర్



కొండాపూర్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

కొండాపూర్, జూన్ 25: రైతు భరోసాకు ఆంక్షలు వద్దని, పది ఎకరాల్లోపు రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని రైతులు అభిప్రాయపడ్డారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ప్రభుత్వం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రైతులకు సమాచారం ఇవ్వకుండా అభిప్రాయం నిర్వహించడం సరికాదన్నారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం 5 ఎకరాల్లోపు రైతులకు మాత్రమే రైతుభరోసాను ఇవ్వడానికి చూస్తోందని, అలా కాకుండా 10 ఎకరాల్లోపు రైతులకు రైతుభరోసా ఇవ్వాలని అనంతసాగర్ గ్రామానికి చెందిన జైపాల్ అనే రైతు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సాగులో ఉన్న ప్రతి రైతుకూ డబ్బులు చెల్లించిందని, ఈ ప్రభుత్వం కూడా 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే అందివ్వాలన్నారు. అవసరమయితే వ్యవసాయ శాఖ అధికారులతే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోని, తహసీల్దార్ అనిత, మండల వ్యవసాయాధికారులు గణేశ్, ప్రతిభ, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, ఆర్ఐలు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు రవి, మనోహర్ రైతులు పాల్గొన్నారు.